క్లుప్తంగా

నేడు వక్తృత్వ పోటీలు

కపిలేశ్వరపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పడమర ఖండ్రిక గ్రామంలో సోమవారం ఐ లవ్ అంబేడ్కర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకూగల విద్యార్థులకు ‘భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్–జీవితం’ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

16న క్యాంపస్ ఇంటర్వ్యూలు

మండపేట: స్థానిక ఆలమూరు రోడ్డులోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ఈ నెల 16న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ బాబి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆయన ఇంటర్వ్యూల వివరాలు వెల్లడించారు. కోడ్ నెక్స ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్వ్యూలకు 2024 –25 సంవత్సరం నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పలు ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు, బ్యాంకింగ్ సంస్థలు క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ చేపట్టనున్నాయని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మండపేట పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పవర్‌లిఫ్టింగ్‌లో నాగేశ్వరరావుకు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ సాధించిన దొమ్మేటి నాగేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 11 నుంచి 13 వరకు గుడివాడలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అండ్ సీనియర్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్రాక్షారామ వాయు పుత్ర వ్యాయామ కళాశాలకు చెందిన దొమ్మేటి నాగేశ్వరరావు 83 కేజీల మాస్టర్స్ కేటగిరీలో మొదటి స్థానం కైవసం చేసుకుని గోల్డ్‌మెడల్ సాధించినట్లు కోచ్ డీఆర్‌కే నాగేశ్వరరావు, గంధం వీరభద్రరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. దొమ్మేటి నాగేశ్వరరావుని పలువురు అభినందించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ


కూళ్లలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం అభయాంజనేయ, సుబ్రహ్మణ్య, గణపతి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాతలు వింజమూరి వెంకటేశ్వరరావు, మంగాదేవి దంపతులు, మంచెం ఆంజనేయమూర్తి, వెంకట సత్య రమ దంపతులు, మేలేటి శ్రీనివాసు, లక్ష్మీదుర్గ దంపతుల చేతుల మీదుగా అంగర వెంకట భాస్కర అంజనీకుమారాచార్యులు, సరస్వతుల శ్రీరామ ప్రసాదుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు కాదా ఏడుకొండలు, ఎంపీపీ పంపన నాగమణి, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రామచంద్రపురం మండల వైస్ ఎంపీపీ సరాల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, మాజీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ వావిలాల సరళాదేవి, గ్రామ ఉప సర్పంచ్ కనకాల రాము, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక గ్రామ సభలు

రాయవరం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో రాజీవ్ గాంధీ సంస్కృతీకరణ అభియాన్‌లో భాగంగా మొదటి చట్టబద్ధమైన గ్రామ సభ నిర్వహించాన్నారు. గ్రామ సభలో పంచాయతీకి సంబంధించిన 29 అంశాలను చర్చించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది, గ్రామ ప్రజలు సభల్లో పాల్గొనాలన్నారు. పంచాయతీలు గ్రౌండ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై చర్చించి, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్‌గా డిక్లేర్ చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీగా చేయడం వంటి తీర్మానాలు చేయాలన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ఆలమూరు: గ్రామంలో వేంచేసిన శ్రీకృష్ణుడి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య యాదవ సంఘ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పుష్పమాలలతో అలంకరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వరి పంటపై దోమపోటు

- రైతుల గగ్గోలు
- ఉధృతిని బట్టే మందుల పిచికారీ


కాజులూరులో దోమపోటుకు గురై బుగ్గిపాలైన వరిపొలం

కాజులూరు: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులకు అన్ని విధాలుగా కష్టాలే ఎదురవుతున్నాయి. ఈ ఏడాది రబీ సాగు తొలి దశ నుంచి సాగునీరందక రైతన్నలను ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రైతులు సమన్వయంతో వంతులవారీ విధానం అవలంభించి కాలువ శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవటంతో దాళ్వా పంట ఒడ్డు దశకు చేరింది. అయితే ప్రస్తుత పంట చివరి దశలోనూ వరిపై సుడిదోమ ఆశించి రైతులను కలవరపెడుతుంది.

ఉధృతంగా ఆశిస్తున్న సుడిదోమ

తూర్పు డెల్టాలోని ఎగువ ప్రాంతంలో పంట కోత దశకు చేరుకోగా నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని సుమారు 52 వేల ఎకరాల్లో ప్రస్తుతం పంట గింజ గట్టిపడే దశ నుంచి పక్వదశకు చేరువలో ఉంది. పంటపై అక్కడక్కడా మాగుడు తెగులు ఆశించగా ఎక్కువ శాతం పొలాల్లో సుడిదోమ కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. సుమారు 20 నుంచి 30 శాతం పొలాల్లో సుడిదోమ ఆశించినట్టు రైతులు అంటున్నారు. అక్కడక్కడా పచ్చదోమ ఆశిస్తుండగా అధిక శాతం పొలాల్లో తెల్లదోమ, గోధుమరంగు దోమలు వరిమొక్కలను ఆశిస్తున్నాయి. తెల్లదోమ, గోధుమరంగు దోమలు మొక్క మొదలు భాగంను ఆశించి పిండిపదార్థాలను పీల్చివేసి శిలీంద్రాలను వ్యాప్తి చేస్తాయి. దీంతో పంటకు తీవ్ర నష్టం కలుగుతోంది. దోమ ఆశించిన స్థలంలో పంట సుడులు సుడులుగా కాలిన పోయిన మాదిరిగా కనిపిస్తుంది. అయితే పంటను రక్షించుకోవాలనే ఆత్రతతో అవసరాన్ని మించి ఎరువులు ఉపయోగించడం అధిక వ్యయాలకు గురి చేస్తుందని రైతులు ఖరీదైన మందును పిచికారీ చేసేముందు దోమ ఉధృతిని గమనించి దానికి అనుగుణంగా మందులు పిచికారీ చేయాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు.


వి.అశోక్, మండల వ్యవసాయాధికారి

ఏ దశలో ఏ మందు వాడాలంటే..

వరి దుబ్బు మొదలులో 20 నుంచి 25 దోమలు ఉన్నట్టు గమనించినట్లయితే బూప్రొఫెజిన్ (అప్‌లాండ్) 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇమిడోక్లోప్రిడ్, ఇదిప్రోల్ (గ్లామోర్), 0.25 మిల్లీ లీటర్లు, లేదా డైనోటోఫిరాన్(ఒషిన్‌టోకిష్) 0.4 గ్రాములు, పైమెట్రిజిన్ (చెస్) 0.6 గ్రాములు లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా వరి దుబ్బు మొదలులో 100 నుంచి 200 దోమలు ఉన్నట్లు గమనించినట్లయితే ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇథోపెన్‌పాక్స్ (న్యూకిల్) 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని వారానికి రెండు సార్లు ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు. వరి దుబ్బుకు 200 పైబడి దోమలు ఉన్నట్లు గమనిస్తే పెనోబుకార్బ్ (బిప్‌విన్) 2 మిల్లీలీటర్లు, లేదా మోనోక్రోటోపాస్ రెండు మిల్లీ లీటర్లు లేదా డైక్లొరోవాస్ (నూవాన్) ఒక మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి రెండు వందల లీటర్ల మందు ద్రావణాన్ని ఎకరం పంటపై పిచికారీ చేయాలన్నారు.


వరిదుబ్బు మొదలుపై ఆశించిన దోమలు, వ్యాప్తి చెందుతున్న శిలీంధ్రం

పెట్టుబడులు పెరిగిపోతున్నాయి



పంటలపై తెగుళ్ల ఉధృతి ఎక్కువవుతుండడంతో ఏ ఏడాదికా ఏడాది పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. మందులు ఖర్చు పెరగడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ప్రకటించిన రైతుభరోసా సొమ్ములు విడుదల చేయాలి.

– పెంకే సత్యనారాయణ, రైతు, కాజులూరు

ముమ్మరంగా పైపులైన్ మరమ్మతులు


ద్రాక్షారామలో ముమ్మరంగా జరుగుతున్న పైపులైన్ మరమ్మతులు

సాక్షి ఇంపాక్ట్

రామచంద్రపురం రూరల్: ఈ నెల 6న సాక్షి పత్రికలో ప్రచురితమైన ‘ద్రాక్షారామలో మంచి నీటికి కటకటా’ కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జల్‌జీవన్ మిషన్ కాంట్రాక్టర్ స్పందించారు. ద్రాక్షారామ ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తొలగించేందుకు ముమ్మరంగా పైపులైన్ మరమ్మతులు చేపట్టి నిర్వహిస్తున్నారు. ఒక్కో వీధిలో సమస్య పరిష్కారమై మంచినీరు అందుతోంది. దీంతో ద్రాక్షారామ వాసులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.


ద్రాక్షారామలో మరమ్మతులు పూర్తయి జోరుగా మంచినీరు వస్తున్న కుళాయి

ఆహ్లాదకరంగా వాతావరణం

- ఈదురుగాలులతో కూడిన వర్షం

కె.గంగవరం: వేసవి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సూర్యుడి ప్రతాపంతో పల్లె గ్రామాలు అల్లాడుతున్నాయి. ఒక్కసారిగా ఆదివారం మధ్యాహ్నం నుంచి గంట సేపు ఆకాశం నల్లని మబ్బులతో ఆహ్లాదకరంగా మారింది. పచ్చని కొబ్బరిచెట్ల మీదుగా ఆకాశంలో ఏర్పాడిన మబ్బులు ప్రజలను అబ్బురపరిచాయి. ఎండవేడితో సతమతమవుతున్న ప్రజలకు చల్లని గాలులతో ఆకాశం మేఘావృతం కావడంతో చిన్నారులు బయటకు వచ్చి కేరింతలు కొడుతూ చల్లదనాన్ని ఆస్వాదించారు. గత మూడు రోజులుగా ఎండతీవ్రత మరింత అధికంగా ఉండడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుములతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు డాబాలపై చేరి చల్లని ఈదురుగాలలను ఆస్వాదించారు. సుమారు గంట సేపు ఏకధాటిగా వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో వృద్ధులు, చంటిపిల్లలు సతమతమవుతున్న తరుణంలో వాతావరణ చల్లబడడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.


నల్లని మబ్బులు కమ్ముకున్న దృశ్యం

ఘనంగా మట్టల ఆదివారం


చేదువాడలో మట్టల ఆదివారం ర్యాలీ


ఆదివారపుపేటలో ఘనంగా మట్టల ఆదివారం

కాజులూరు: పేదలను ప్రేమిస్తూ వారికి సేవలు చేసే వారికి పరమాత్ముని ఆశీర్వచనాలు ఎల్లప్పుడూ ఉంటాయని మార్త వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ కె.స్టీవెన్ అన్నారు. మట్టలఆదివారం పండుగ పురస్కరించుకుని చేదువాడ, మంజేరులో క్రైస్తవులు, చిన్నారులతో కలసి గ్రామ వీధుల్లో ప్రభువు యేసు త్యాగాలను పాటల ద్వారా భక్తులకు వివరించారు. కార్యక్రమంలో మార్త వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ పాస్టర్ శాంతిబాబు, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ సీబీఎస్ చర్చి ఆధ్వర్యంలో తోటపేట నుంచి ద్రాక్షారామ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఆదివారపుపేట, రావిచెరువు గ్రామాల్లో రాక్ పెంతుకోస్తల్ చర్చి పాస్టర్లు బిషప్ కనికెళ్ల ఆనందకుమార్, బేబీ రత్నకుమారిల ఆధ్వర్యంలోను ర్యాలీలు నిర్వహించారు. వివిద రకాల పూలతో అందంగా అలంకరించిన ఈత మట్టలు పట్టుకుని క్రైస్తవులు చిన్నారులతో కలసి కీర్తనలు పాడుతూ ఊరేగింపులు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

తప్పుడు కేసులపై విచారణ చేయండి


- ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్


డీఎస్పీ రఘువీర్‌ను కలసిన ఎంపీ బోస్, సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలో జరిగిన ఒక సంఘటనపై ద్రాక్షారామ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదును విచారించకుండా ఫిర్యాదు దారులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని, వాటిపై విచారణ జరిపించి నిజా నిజాలు తేల్చాలని, తప్పు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ రఘువీర్‌ను ఎంపీ బోస్, సూర్యప్రకాశ్ ఇతర వైఎస్సార్ సీపీ నేతలు కలసి వివరాలను అందజేశారు. ఇటీవల భీమక్రోసుపాలెంలో జరిగిన సంఘటనను సర్పంచ్ పలివెల లోవరాజు, బాధితుడు పెనుమళ్ల లక్ష్మణరెడ్డి తదితరులతో కలసి డీఎస్పీ రఘువీర్‌కు వివరించారు. ఈనెల 8న గ్రామానికి చెందిన లక్ష్మణరెడ్డి గ్రామంలోని ఒక చెరువు వద్దకు వెళ్లి చేతులు కడుక్కొంటుండగా అదే గ్రామానికి చెందిన కూనిశెట్టి వీరేంద్రరెడ్డి దుర్భాషలాడుతూ తనపై కత్తితో దాడి చేసినట్లు వివరించారు. ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పినందుకు వతిరిగి మరోసారి కత్తితో దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు చెప్పారు. ఇదే విషయాన్ని ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేయగా మూడు రోజుల పాటు తిప్పించుకుని కేసు నమోదు చేశారని, అయితే కౌంటర్ కేసుగా వీరేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో లేని వారిపై కూడా కేసులు పెట్టడం అన్యాయమని వారు డీఎస్పీకి వివరించారు. గ్రామంలో తనపై దాడి చేస్తున్న సమయంలో చాలా మంది చూశారని వారందరినీ విచారణ చేయాలని వారు కోరారు. కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ జరిగిన సంఘటనను విచారించకుండా ఎవరైతే బాధితులున్నారో వారిపై కేసులు కట్టడం ఎంత వరకు సమంజసమని డీఎస్పీకి వివరించారు. గతంలో నియోజకవర్గంలో వెల్ల సావరం లేవుట్ వద్ద ఇసుకను కొంత మంది దొంగిలించుకుపోతే ఆ కేసును కూడా ద్రాక్షారామ కేసులు నీరుగార్చే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల కౌంటర్ కేసుల ఆనవాయితీ ఎక్కువగా ఉందన్నారు. తప్పు జరిగితే తప్పును తప్పుగానే చెప్పాలని బాధితులకు న్యాయం చేసే విధంగా పోలీసులు వ్యవహరించాలని ఎంపీ బోస్ సూచించారు. డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ తాను స్వయంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని ఎంపీ బోస్‌కు తెలియజేశారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మండల వైస్ ఎంపీపీ శాఖా బాబి, కౌన్సిలర్లు కేతా శ్రీను, తోట సూరిబాబు పార్టీ నేతలు మట్టా బాబులు, వేల్పూరి రాంబాబు, బండి త్రిమూర్తులు, శీలం గంగరాజు, కూనిశెట్టి ప్రకాశ్ రెడ్డి, చిట్టూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విభిన్నంగా అంబేడ్కర్ చిత్రం

రామచంద్రపురం రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ విభిన్న చిత్రాన్ని గీశారు. అణగారిన వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, సమాజంలో మార్పు కోసం రాజ్యాంగం ద్వారా అందజేసిన ప్రాథమిక హక్కుల వివరాలతో అంబేడ్కర్ చిత్రం పటం ఏర్పడేలా చేశాడు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి పెయ్యల వేణుబాబు చిత్రించిన చిత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది. వేణుబాబుని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.




రాజ్యాంగంలో రూపొందించిన హక్కుల వివరాలతో అంబేడ్కర్ చిత్రపటం. (ఇన్‌సెట్లో) చిత్రం గీసిన పెయ్యల వేణుబాబు

వరివడిగా పంట ఒబ్బిడి

- నియోజకవర్గంలో ముమ్మరంగా వరికోతలు
- ఎకరాకు 50 బస్తాల దిగుబడి
- పంట కోత ప్రయోగాల్లో తేలుతున్న ఫలితాలు


రాయవరం మండలం వి.సావరంలో యంత్రాలతో వరి కోతలు

రాయవరం: ఎన్ని ‘వరి’దొడుకులు ఎదురైనా వెన్ను చూపక ఏరువాక సాగించిన అన్నదాత కష్టం ఫలించే సమయం ఆసన్నమైంది. కష్టనష్టాలకోర్చి సాగు చేసిన రైతన్నల స్వేదం పంట లక్ష్మి రూపంలో ఇంటికి రానుంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో రబీ వరి కోతలు ముమ్మరంగా జరగుతున్నాయి. క్లస్టర్ పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో 1.01 లక్షల ఎకరాల్లో రైతులు రబీ వరిసాగు చేపట్టారు. సుమారుగా 90 శాతం మేర ఎంటీయు 3626 (బొండాలు) రకాన్ని, మిగిలిన 10శాతం మేర ఎంటీయు 7029 (స్వర్ణ), పీఆర్ 126, నెల్లూరు సన్నాలు తదితర రకాలను సాగు చేశారు. ఇంచుమించు 95 శాతం మంది రైతులు వెదజల్లు సాగు, బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకే మొగ్గు చూపారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరికోతలు ప్రారంభమయ్యాయి.

అనుకూలించిన వాతావరణం

రబీ సాగుకు ఈ ఏడాది వాతావరణం అనుకూలించింది. వరి నాట్లు వేసినప్పటి నుంచి వాతావరణం అనుకూలించడంతో తెగుళ్లు, పురుగులు ఆశించడం తక్కువే అని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎక్కడా దోమ ప్రభావం కన్పించలేదు. ఆశించిన మేర దిగుబడులు వచ్చే అవకాశముంది. దిగుబడులపై పూర్తి ఆశలతో రైతులు రబీ వరికోతలకు సిద్ధమయ్యారు.

దిగుబడిపై ఆశలు

రబీ ప్రారంభంలో వరి పంటకు తెగుళ్లు అంతగా లేవు. వాతావరణం అనుకూలించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. రబీ చివర్లో తెగుళ్లు ఆశించినా చెప్పుకోదగ్గ స్థాయిలో లేవు. అక్కడక్కడా దోమ ప్రభావం కన్పించినప్పటికీ రైతులు వెంటనే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇప్పటికే వరికోతలు ప్రారంభించిన చేలల్లో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుంది. ఇప్పటికే నిర్వహించిన పంటకోత ప్రయోగంలో 50–55 బస్తాల దిగుబడి వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. రెండు చోట్ల నిర్వహించిన పంట కోత ప్రయోగాల్లో 50 బస్తాల పైబడి దిగుబడి వచ్చిందని ఆయన తెలిపారు.

జోరుగా రబీ వరి కోతలు

మండపేట: రైతన్న ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికి అందే సమయం ఆసన్నమైంది. ఎండనక వాననక రైతులు పొలాల్లో కష్టించి రబీ పంటను కాపాడుకుంటూ వచ్చారు. రైతన్న పడిన కష్టానికి ప్రతిఫలం దక్కే గడియలు రానే వచ్చాయి. మండల పరిధిలోని గ్రామాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో పది రోజల క్రితమే రైతులు కోతలను ప్రారంభించారు. ప్రస్తుతం పలు గ్రామాల్లో రైతులు వరికోత యంత్రాల ద్వారా పంటను ఒబ్బిడి చేస్తున్నారు. మండలంలోని 12 గ్రామాలు, పట్టణంతో కలుపుకుని సుమారు 16500 ఎకరాల్లో ఈ ఏడాది రైతులు వరిసాగు చేపట్టారు. రైతులు బొండాలతో పాటు సన్నాలు రకం సాగు చేశారని మండల వ్యవసాయాధికారి ఏసుబాబు తెలిపారు. దీనిపై ఐదు ప్రాంతాల్లో పంట కోత ప్రయోగం చేపట్టామన్నారు. అందులో గరిష్టంగా ఎకరాకు 68.50 బస్తాలు, కనిష్టంగా 37 బస్తాలు వచ్చినట్టు తెలిపారు. ప్రతి ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తున్నట్టు అంచనా వేశామన్నారు. ఇప్పటివరకూ 1000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. పట్టణంలో ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండగా మండలంలోని ఆయా గ్రామాల్లో 15 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ 500 ఎకరాల్లో పండించిన ధాన్యాన్ని సేకరించామని వివరించారు.

వరికోతలు ప్రారంభం

కె.గంగవరం: మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా పంట వేసుకున్న రైతులు ఎండలు కాయడంతో నేల ఆరుదల ఉన్న పంట పొలాల్లోని వరిని భద్రం చేసి పనిలో పడ్డారు. ఒకవైపు ఎంత తీవ్రతకు కూలీలు పనులు రాకపోవడంతో యంత్రాల ద్వారా వరి కోత పనులు చేస్తున్నారు. నేల ఇంకా ఆరని పంట పొలాల రైతులు కూలీలను బుజ్జగించి కూలీ రేట్లు పెంచి మరీ కోత కోయిస్తున్నారు. మరో రెండు, మూడు వారాలు వాతావరణం అనుకూలిస్తే ధాన్యం అమ్మకాలు పూర్తవుతాయని రైతులు ఆశతో ఉన్నారు. ఈ ఏడాది వరి అనుకున్నంత కన్నా ఎక్కువగా సాగు అవ్వడంతో రైతుల ఆనందం వ్యక్తం చేశారు. తొలకరిలో అకాల వర్షాల కారణంగా కొంత వరకు రైతులు నష్టపోయి ఆందోళన చెందారు. అయితే ప్రస్తుతం మాత్రం ఆనందంతో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రూరల్‌లో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ప్రస్తుతం రైతులు వరిసాగు చేస్తున్నారు.


శివలలో వరికోత యంత్రంతో సేకరిస్తున్న ధాన్యం

దిగుబడి బాగుంది



ఇప్పటికే రైతులు వరికోతలు ప్రారంభించారు. ముందుగా వరినాట్లు వేసిన పొలాలు కోత దశకు చేరుకున్నాయి. వాతావరణం కూడా అనుకూలించింది. దిగుబడులు బాగానే ఉన్నాయి. ఎకరాకు సరాసరిన 50 బస్తాల దిగుబడి వస్తోంది.

– సిరికి కృష్ణారావు, కౌలు రైతు, వి.సావరం, రాయవరం మండలం

తెగుళ్ల ప్రభావం తక్కువే



గ్రామానికి నాలుగు చొప్పున పంట కోత ప్రయోగాలు చేస్తున్నాం. పంట కోత ప్రయోగాల్లో సరాసరిన 50–55 బస్తాల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది తెగుళ్ల ప్రభావం తక్కువనే చెప్పాలి. ముందుగా వరినాట్లు వేసిన పొలాల్లో వరికోతలు ఇప్పటికే ప్రారంభించారు. యంత్రాలపై వరికోతలకు రైతులు ప్రాధాన్యమిస్తున్నారు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం